# ఎండవేళా కొంప గుండాటలు



పరీక్షలవుతున్నంత సేపూ ఎప్పుడు సెల వలిస్తారా? ఎప్పుడాడుకుంటామా ! అని ఎదురు చూస్తాం గానీ ఈ సెలవలు మావిడి పళ్లు తినేందుకు తప్ప ఇంకెందుకూ పనికి రావటల్లేదు. పైగా పొద్దున్నే నాన్న ఆఫీసుకెళ్ళేటప్పుడు పనిగట్టుకు లేపి మరీ



చెప్పి వెడతారు. నాలుగున్నరలోపు బయట తిరగద్దని. ఈ తోచక చచ్చిపోడం కన్న ఎండదెబ్బ కొట్టి చచ్చిపోతేనే హాయిగా వుండేటట్లుంది. దానికితోడు నాకు తోకల్లాగా ముగ్గురు - అక్కా అని కూడా పిలవడ విష్టం లేని చెల్లెళ్ళు. నేనే గదిలోకెడితే అక్కడికే వచ్చేస్తారు ఏదో పేద్ద పనున్నట్లు. అమ్మేమో ఫాషనుగా వివిధ భారతి పెట్టుకుని వింటూ ఏదో శేష ప్రశ్నట చదువుకుంటోంది. ఎక్కడనించి సంపాయిస్తుందో చేతిలో ఎప్పుడూ ఏదో ఒక నవలుండాల్సిందే. అమ్మని కదిపే ధైర్యం లేక అన్నిటికీ వీళ్ళు నన్ను తోస్తారు.

''అమ్మా!''

''ఊఁ''

''అమ్మా మరేమో ఆకలేస్తోందే మా అందరికీనూ !'' చివరికి నా నోరు పెగిలింది.

''ఇప్పుడు టైం ఎంతయిందీ?'' పుస్తకంలోంచి తలెత్తకుండానే అడిగింది అమ్మ.

''రెండున్నరయిందే'' గడియారం వంక చూడకుండానే నేను చెప్పా!

''పొద్దున్నించి ఏవేం తిన్నారో వరసగా చెప్పండి!''

''నీకు తెలియకుండా ఏం తింటామే ! ఏడింటికి అన్నం, మళ్ళీ ఒంటిగంటకీ అన్నవే పిచ్చి పప్పు పిచ్చి కూర వేసుకుని!''

''ఆ తర్వాత?''

''తర్వాత ఏం లేదు ! అయ్యో మర్చిపోయా ! నిమ్మకాయలంత మావిడి పళ్ళు రెండు. అంతా టెంకే అందులో ఏం బాలేవు!''

దానితో అమ్మకి కోపం వచ్చేసింది. ''అసలు మీరు పిల్లలా? పిశాచాలా? నేనింకా మిగిలా కదా- నన్ను తినేయండి - మీకో పనయిపోతుంది. ఏవీ ఆడుకోడం చేతకాక అస్తమానం ఆకలని నా చుట్టు తిరగడం. ఇలాగే తిన్నారంటే సెలవలయ్యేటప్పటికి కళ్ళూ, ముక్కు‌లూ పూడుకు పోయి పూర్ణబ్బూర్లులా, అయిపోతారు నాకేం ! నాలుగున్నర దాకా నా జోలికి రాకుండా వుంటే అప్పుడు ఏదన్నా చేసి పెడతా.''

ఇంక ఈవిడని విసిగిస్తే నాలుగున్నరకి కూడా ఏం పెట్టదు. వెనక్కి తిరిగి చూస్తే ఎవరూ లేరు . ఎప్పుడో అంతా పారిపోయారు.

''సర్లే అమ్మా! అప్పటిదాకా వాళ్ళని నే చూసుకుంటాలే. పాపం నువ్వు పడుకో మధ్యాహ్నం పూట కాసేపయినా పడుకోపోతే నీకు తలనొప్పొస్తుంది కదా!''

''ఇదిగో సుశీలా ! దుర్గ పెందరాళే అంట్లు తోమి వెళ్ళిపోతానంది. దాని తమ్ముడి పెళ్ళికి వెళ్ళాలట. అది రాగానే గిన్నెలు గ్లాసులు ఎక్కడెక్కడున్నాయో అన్నీ బయట వేయండి. గిన్నెలయ్యాక నాలుగు చేదలు నీళ్ళు తోడి గోలెం నింపమను'' అని చెప్పి అమ్మ హాయిగా పట్టె మంచం మీదికి చేరి రేడియో తగ్గించి పుస్తకంలో పడిపోయింది. ఎలాగూ రెండు నిమిషాల్లో నిద్దట్లోకి వెళ్ళిపోతుంది. రోజూ చూస్తూనే వుంటాగా !

తలుపు దగ్గరేసి బయటకి రాగానే దుర్గ రానే వచ్చింది అమ్మదో పాత పట్టుచీర కట్టుకుని.

చిన్నారి కళ్ళిట్టే పసిగడతాయి. ''ఏం దుర్గా ! మా అమ్మ చీర కట్టుకుని మా ఇంటికే వచ్చావే షోగ్గా! భయం వెయ్యట్లే?''

''నాకెందుకు బయం. నిన్న సందెకాడ అమ్మే ఇచ్చింది. పైట కొంగంతా తూట్లుపడింది గదాని కట్టట్లేదుటందుకని. గిన్నెలడేయండి. ఆలీసం చేయమాకండి'' నలుగురం ఒక్క ట్రిప్పులో ఎనిమిది చేతులతో అంట్లన్నీ బయటపడేశాం!

మా అందరి చేతుల మీదా నీళ్ళు పోసి దాని పని అది చకచకా చేసుకుంటూ ఒక్కసారి

తలెత్తి చూసేటప్పటికి నలుగురం అక్కడే కూచుని దానికేసి చూస్తున్నాం !

''ఓరి దేవుడో ! నా వంకట్ట చూత్తాన్నారేటి ! అమ్మ కనిపెట్టుండమన్నారా ఏంటి ?'' దాని కసలే ముక్కు మీద కోపం. ''ఎండెలాగ్గుందో ! లోనకెల్లి పోండి''

నాకప్పుడు వచ్చింది అయిడియా. ''నిన్నెందుకు కనిపెట్టుండడం. నువ్వేం చిన్న పిల్లవి కాదుగా దెబ్బలు తగుల్చుకునేందుకు. మేవే వూరికే చూసి నేర్చుకుందామని నువ్వంట్లెలా తోముతున్నావో ! ఒకవేళెప్పుడన్నా నువ్వు రాలేదనుకో. అంట్లు తోవడం వస్తే మాకే మంచిది కదా!''

దుర్గమొఖం ఇంతయి పోయింది. సంతోషంతో ''అట్టా అన్నారు బాగుండాది. ఆడ పిల్లన్నాక అన్ని పన్లు వచ్చుండాల. సేతిలో ఇద్యుంటే కొట్టదు కదా ! మా సిన్నది మూడేళ్ళల్లో పని సేస్తంది. ఇప్పుడీ గిన్నెలన్నిట్ల రెండు చెంబులు నీళ్ళోసి సిటికెమంతసేపట్ట వదిలెయ్యాల. ఈ మజ్జల మంచి నీళ్ళ గిలాసులూ టిపిను ప్లేట్లూ కొంచెం కుంకుడు పిప్పిలెట్టి అట్టట్టని కడిగేయాల. అప్పుడీ అంటగిన్నెల్ని కొబ్బరి చిప్పల బూడిదుంటది కదా. అద్దీసుకుని కొబ్బరి పీచెట్టి గట్టిగా తోవాల. జిడ్డుంటే ఓపాలి కుంకుడు పింపెట్టి రుద్దేత్తే శుబ్బరంగ వచ్చేత్తాయి. ఇగ ఆ మట్టున కుసింత నీళ్ళతో ముందు కడిగి మరిన్ని పోసి మళ్ళీ కడిగేడవే!'' చూస్తుండగానే గిన్నెలన్నీ తళతళా తోమేసి గట్టు మీద బోర్లించేసింది. ''మీరియ్యాటిని లోనెట్టకండి - అమ్మగారు లేచినంక నీళ్ళు జల్లి తీసుకుంటారు'' అని అదివెళ్ళిపోడానికి రెడీ అయిపోతోంది. ప్రభువు దయవల్ల నాకు గబుక్కున గాపకం వచ్చింది ''అమ్మ నిన్ను గోలెంలోకి నీళ్ళు తోడమంది''

''వామ్మో!పెళ్ళోరి బస్సు నాకోసర వాగుద్దేంటండి. ముందుగాలసెప్తే అమ్మగారు కోం పడతారని సెప్పలా. రేపు పొద్దుటాల ఆడపెళ్ళారింట్ల ఇందులంట. నానెల్లుండి తెల్లారి పట్ల కల్లవచ్చేత్తా. రేపటికిసద్దుకొమ్మని చెప్పండేం. లోనకెలిపొండమ్మ. వడకొట్టేత్తాదీ టయంలో'' అంటూ చీర శుభ్రంగా దులుపుకుని కుచ్చెళ్ళు మళ్ళీ పెట్టుకుని దుర్గవెళ్ళిపోయింది.

అంట్లు తోవడం మా నలుగురికీ వచ్చేసింది. కాబట్టి ఇది ఎన్నాళ్ళు రాకపోయినా ఇబ్బంది లేదు. కానీ చూడు ఈ పనివాళ్ళ కస్సలు విశ్వాసాలుండవు. అమ్మ మరి మాకూ్కడా పరికిణీలు కుట్టించకుండా దానికంత చీరపళంగా ఇచ్చేసింది కదా ! నీళ్ళు తోడకుండానే వెళ్ళిపోయింది. అయినా అదంటేనే అమ్మకి ప్రేమ. నేనేదయినా అంటే నన్నే కేకలేస్తుంది నాకక్కరలేని విషయాలు లేవని.

ఇప్పుడీ నీళ్ళ సంగతి ఏం చెయ్యాలిరా భగవంతుడా ! గదిలో కెళ్ళి చూస్తే ఇంకా అమ్మ హాయిగా నిద్దరపోతునే వుంది మహారాణిలా. పోనీ ఓ పనోటి చేస్తే ! ఆ నీళ్ళు కాసిని మేవే తోడి

పెట్టేశామనుకో. పాపం అమ్మ ఎంతో సంతోషిస్తుంది కదా - సెలవులని చెప్పి తినితినీ బూరెల్లా అయిపోకుండా పన్లు నేర్చుకుంటున్నావని !

దుర్గపుణ్యమా అని అంట్లు తోవడం ఎలాగు వచ్చేసింది. ఇంక నీళ్ళు తోడడం ఒకళ్ళు నేర్పేందుకేం వుంటుందీ ! ఇన్నాళ్ళు మమ్మల్ని బావి దగ్గిర కెళ్ళనీక పోబట్టిగాని ఆ పని మాకెప్పుడో వచ్చేసుండేది. ఏ పన్లు నేర్చుకోకుండా గాడిదల్లా కోవటి దివాళా ఆడుకుంటూ కూచుంటే ఏం ముద్దుగా వుంటుంది గనుక. నీళ్ళు తోడే ఆటాడు దావే అంటే చిన్నారి వెంటనే ఒప్పుకుంది అంటే ఇది మంచి ఆటేనన్నమాట. అసలు ఏ విషయమన్నా దాన్నొప్పించడం కన్నా హిందీ నేర్చుకోడవే సుళువు.

ఇందూ, బుజ్జీ మేం ఏం తేలుస్తామోనని మా ముఖాలకేసి చూస్తూ కూచున్నారు !

చివరికి చిన్నారే చివరి మాట చెప్పింది "ఎలాగూ పెద్దవాళ్ళం అవుతున్నాం కదా! ఈ సెలవుల్లో కొన్ని పన్లేనా నేర్చుకుంటే కొత్తస్కూలు తెరిచాక టీచరు గారికి చెప్పచ్చు. కానీ మనం బావి దగ్గిర కెళ్ళామని తెలిస్తే అమ్మ చంపేస్తుంది. కాబట్టి నీళ్ళు తోడిన కాసేపూ వంటిల్లు బయట నించి గొళ్ళెం పెట్టేస్తే ఆ పనవగానే తలుపు తీసెయ్యచ్చు. అమ్మేమో దుర్గే నీళ్ళు తోడి వెళ్ళి పోయిందనుకుంటుంది".

పనిలోకి దిగుదామని నూతి దగ్గిరకెడితే కాళ్ళు మాడిపోతున్నాయి. అమ్మగానీ చూసిందంటే ఎంచక్కా దోసెలు పోసుకోవచ్చునని అనుకుంటుంది కానీ ఇప్పుడు పనవడం ముఖ్యం కదా ! ముందుగా గోలెంలో వున్న నీళ్ళు పది చెంబులు దిమ్మరిస్తే కాస్త కాలు పెట్టేందుకు వీలయింది. నెత్తిమీద కూ్కాడా బలే వేడొచ్చేస్తోంది. అక్కడారేసిన బట్టల్లోంచి బనీన్లు, రెండు రుమాళ్ళు తడిపి అందరం తలమీద వేసుకున్నాం. కాకపోతే అది వూరంత బావి. పేద్ద కొబ్బరితాడు. చేదనీళ్ళలో పడిపోకుండా గిలక కర్రకి కట్టేసుంది. మా అదృష్టం కొద్దీ తాడు గిలకమీద సరిగ్గానే వుంది. నలుగురం కలిసి ఒక్కలాగు లాగితే చేద సగం పైగా నీళ్ళతో పైదాకా వస్తోంది కానీ ఆ చేద ఎలా అందుకోవాలో తెలియక ఆలోచనలో పడ్డాం. అందర్లోకి పెద్దదాన్ని నాకే చేద అందకపోతే ఇంక పిల్లలకేం అందుతుంది !

ఈ వుపాయమూ చిన్నారే చెప్పాల్సి వచ్చింది. బట్టలు నానబెట్టుకునే ఇనప బక్కెట్టు బోర్లించి దానిమీద నిలబడితే పెద్దవాళ్ళంత పొడుగ్గా వుంటాం కాబట్టి చేద అందుతుందని. నీళ్ళతో చేదపైదాకా వచ్చాక మళ్ళీ బావిలోకి దిగిపోకుండా తాడు అది గట్టిగా పట్టుకుంటానంది. నన్నేమో బక్కెట్టెక్కి చేదందుకోమంది. ఎంతయినా నేనంటే దానికీ ప్రేమే కదా ! గబుక్కున నేను నీళ్ళల్లో పడిపోకుండా వుండటానికని నా కాళ్ళని ఇందూనీ, బుజ్జినీ పట్టుకోమంది. తీరా మొదలెట్టాక పాపం ఏమనుకుందో తాడు పట్టుకునే పని ఇందు

కప్పుచెప్పి అది నా నడుమ్మూ బుజ్జి నా కాళ్ళూ పట్టుకోడం మొదలెట్టారు. అన్ని జాగర్తలూ తీసుకున్నాం కాబట్టి అమ్మలేచి తలుపు బాదకుండానే ఎవరవూ బావిలో పడకుండానే నీళ్ళు తోడేయడం పనయిపోయింది. నిమిషాల్లో గోలెం పొంగిపోయింది. మళ్ళీ ఆ బనీన్లూ రుమాళ్ళూ జాడించేసి ఆరేశాం ! పన్లో పనిగా అందరం తలా రెండు బక్కెట్ల నీళ్ళతో హాయిగా కాళ్ళూ చేతులూ శుభ్రరంగా కడుక్కున్నాం. నిజానికి నీళ్ళు తోడే పనయ్యాకకాళ్ళు కడుక్కోనక్కర లేదు గానీ ఇంక సాయంత్రం ఆ పని చేయడం తప్పింది కదా !

బట్టలు పూర్తిగా తడిస్తే తడిశాయి గానీ అవి వంటిమీదే ఆరుతుంటే వేడి గాలి కాస్తా ఎంత చల్లగాలిగా మారిపోతోందో ! అయినా ఎండవేళ ఇలా ఎంచక్కా నీళ్ళ పని పెట్టుకోవాలి గానీ వేడివేడి పరుపుల మీద దొర్లితే ఏం వస్తుంది! ఏమయితేనేం ఇంక రేపట్నించి తోడకపోడం వుండదు. ఒప్పుకోవాలే గానీ ఇంటి వాళ్ళ గోలెం కూడా మేవే నింపేయచ్చు.

''నానీ నా చేతులు చూడు ఎంత ఎర్రగా అయ్యాయో'' బుజ్జి మహా సంతోషంగా చూపిచ్చింది. అందరి చేతులూ ఎర్రగా అయ్యాయి గానీ ఒకటే మంట. ఇప్పుడు కొబ్బరి నూనె రాసుకుందామంటే ఆ సీసా అమ్మ తలదిక్కున అలమర్లో వుంది. ఎంత నెమ్మదిగా తీసినా అమ్మకి మెలకువ రానే వచ్చింది ఆ కాస్త చప్పుడుకే !

''నూనె సీసా దేనికే ! ఎవరైనా పడ్డారా ?''

''ఎలా పడతారు ? నానీ పడకుండా చిన్నారి పట్టుకుంది. చిన్నారి పడకుండా నేను దాని కాళ్ళు పట్టుకున్నాను. ఎవ్వరూ పడలే'' బుజ్జి చక్కగా వర్ణించి చెప్పింది.

''ఏయ్ సుశీలా ! ఏవిటి బుజ్జి చెప్తోంది?''

''ఏం లేదమ్మా. ఇందూ జుట్టు పిచిగ్గూడులా వుందంటావు గదా. పోనీ నూనెరాసి చిక్కు తీద్దామనీ. నువ్వు ఇంకాసేపు పడుకో. మేం చిక్కులు తీసుకుంటూ వుంటాంలే!''

''ఏం లేకపోడవేమిటి ? ఇలా దగ్గిరిసారా ! బట్టలన్నీ తడితడిగా వున్నాయేమిటి ? ఏం తగలెట్టారు మీరందరూ ?'' వెంటనే లేచి పెరట్లోకి పరిగెత్తింది. గోలెం నిండా నీళ్ళు, తడితడిగా బావి పళ్లెం, బోర్లావున్న బట్టల బక్కెట్టు, మా అందరి అరిచేతులు మొత్తం మేం ఎవ్వరూ నోరిప్పక్కరలేకుండానే కథంతా చెప్పాయి.

''అసలు నిన్ను నాలుగు తగల్నిస్తే వీళ్ళందరికీ బుద్దొస్తుంది. ఎండవేళా ఒక్క గంట నడుం వాలుద్దామంటే లేకుండా కొంప గుండం చేసే వెధవాటలూ నువ్వూనూ!'' తను తగల్నించేందుకు, మిగల్నిచ్చేందుకు దొరికినప్పుడు కదా ! ఎలాగూ మిగతా వాళ్ళ నెవ్వళ్ళనీ ఆవిడ ఏవీ చెయ్యదుగా ! కష్టంతా నామీదే కదా !